


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ డ్విపే డొయిచ్ ఖండే

**ఆయన** నాతో ఎప్పుడు సంభాషణ ప్రారంభించినా – ఇండియాని గేలి చేస్తూ మొదలెట్టేవాడు. నేను శాంతంగా విని అక్కడి సంప్రదాయాన్నీ, ఆచారాల్నీ వివరించి చెప్పేవాణ్ణి. తర్వాత ఆయన ఆ విషయమై గట్టిగా ఆలోచించేవాడు.

ఐతే మన జీవన విధానంలో హిపోక్రిసీ చాలా ఎక్కువ. దానికి ఏమని సంజాయిషీ ఇవ్వగలం? ఐనా నా ప్రయత్నం నేను సిన్సియరుగా చేసేవాణ్ణి. అందువల్ల ఇండియాపై ఆయన అభిప్రాయాలు పెరిగాయో లేదో తెలియదు కానీ, నాపై మాత్రం ఆయనకు గౌరవాభిమానాలు పెరిగాయి. అక్కడ ఆయనవంటి మంచివాడి సాహచర్యం లభించినందుకు నాకూ సంతోషంగా అనిపించేది.

నా అలవాట్లను బట్టి, ఆఫీసులో జర్మన్సుకి నేనో విచిత్రవ్యక్తిలా తోచేవాణ్ణి. అంతవరకూ వాళ్లకి నాలాంటి ఇండియన్ తగల్లేదుట. ఏది ఏమైనా నా అలవాట్లు ఒక విధంగా మన దేశంమీద వారికున్న కొన్ని దురభిప్రాయాల్ని పోగొట్టడానికి సహకరించాయని చెప్పొచ్చు.

చాలామంది జర్మన్సు దృష్టిలో ఇండియా పేద దేశం. అక్కడ సామాన్యులకి కనీసావసరాలు దొరకవు. పౌరులు అనాగరిక స్థితిలో ఉన్నారు. అలాంటి దేశంనుంచి ఇక్కడికొచ్చి, ఇక్కడి సదుపాయాల్నీ, వైభవాన్నీ చూసి మైమర్చిపోయి, ఇక్కడే స్థిరపడిపోవాలనుకుంటారు. అది కుదరనప్పుడు– ఉన్నన్ని రోజులూ ఆబగా అందినన్ని సౌఖ్యాలు అనుభవించాలనుకుంటారు.

వాళ్ల ఈ అభిప్రాయానికి నేను సవాలయ్యాను.

నాకు జర్మనీ నచ్చింది. వారు సాధించిన ప్రగతి నాకు జర్మన్ పౌరులపట్ల గౌరవభావాన్ని కలిగించింది. ఐతే నేను వారి దేశానికొచ్చింది – కొన్నాళ్లు వారి వైభవంలో పాలు పంచుకుందుకు కాదు. అక్కడున్న ఆధునిక వైజ్ఞానిక సదుపాయాల సహకారంతో, శాస్త్ర పరిశోధనలు కొనసాగించి నా విజ్ఞానానికి పదును పెట్టాలనుకున్నాను.

అంతవరకూ బాగానే ఉంది.

మరి జర్మన్లకు నిత్య జీవితంలో ఆల్కహాల్ ఒక ముఖ్యభాగం. నేను ఏ రూపంలోనూ దాని వాసన కూడా చూడను.

నా పక్కనే పని చేసే హెర్ (మిస్టర్) హైనర్ డెకర్ట్, రాలెక్ దగ్గర రీసెర్చి స్టూడెంటు. తొలి పరిచయంలోనే మా ఇద్దరికీ మంచి స్నేహం కలిసింది.

"వైన్ పుచ్చుకోకపోతే మీరు పండుగలెలా జరుపుకుంటారు?" అని ఒకసారి నన్నతను ఆశ్చర్యంగా అడిగాడు.

అతనలా అడగడం సబబే. మరక్కడ పండుగలకీ, వైనుకీ అవినాభావ సంబంధముంది. అసలు వైన్ తాగడమే పండగ వారికి.

"నువ్విలా ఆశ్చర్య పడుతున్నావా? పండక్కి వైన్ తాగుతారేంటని మేమక్కడ మీ గురించి ఆశ్చర్యపడతాం. ఎందుకంటే మా దేశంలోనూ వైన్ తాగేవారు చాలామందున్నారు. వాళ్లు కూడా పర్వదినాల్లో వైన్ ముట్టుకోరు. వైనే కాదు, మిగతారోజుల్లో మాంసం లేందే ముద్ద దిగనివాళ్లు కూడా, పర్వదినాల్లో మాంసాహారం జోలికి వెళ్లరు" అన్నాను.

"పండగంటే వైనూ, మాంసం ముట్టుకోకపోవడమా? ఐతే అదేం పండగ?" అన్నాడు డెకర్ట్.

"అలా ఎందుకనుకోవాలి? మీ లెక్క ప్రకారం మా దేశంలో చాలామందికి నిత్యం పండగలే. మీరుమాత్రం అప్పుడప్పుడే పండగ జరుపుకుంటారు" అన్నాను నేను.

ఈ సమాధానం డెకర్ట్‌కి నచ్చలేదు.

డెకర్ట్‌కే కాదు. మా ఆఫీసులో చాలామంది విదేశీయులకూ, జర్మన్సుకీ నా సమాధానాలు నచ్చేవి కాదు. ఒక పేద దేశంనుంచి వచ్చి విలాసాలకోసం ఆత్రపడిపోవడానికి బదులు – తామెంతో అపురూపంగా భావించేవాటిని నిరసించడం అసంతృప్తిగా ఉండేది వారికి. పోనీ అంటే నేనెప్పుడూ వాళ్ల అలవాట్లని తప్పు పట్టేవాణ్ణి కాదు. సమాధానాలకు తర్కాన్ని మాత్రమే వాడేవాణ్ణి.

అందువల్ల కొందరికి పట్టుదలగా ఉండేది – ఇండియాలో దరిద్రం తాండవిస్తున్నదనీ, అక్కడి పౌరులది నికృష్ట జీవితమనీ – నాచేత ఒప్పించాలని!

డాక్టర్ రాలెక్‌కి మరో స్టూడెంటు – మ్యుల్లర్. సన్నగా పొడవుగా నీలి కళ్లతో హీరోలా ఉండేవాడు. అతనొకసారి నాతో మాంసాహారం గురించి చర్చకు దిగాడు.

చాలామంది జర్మన్లలో మెచ్చుకోతగ్గ విషయమేమిటంటే – వారి మనసులో ఏమున్నా, ఎదుటి వ్యక్తిపై ఎటువంటి భావాలున్నా, మాట్లాడే తీరు మాత్రం ఎంతో సౌమ్యంగా ఉంటుంది.

“రావ్! మాంసాహారం ఎందుకు తీసుకోవు?” అనడిగాడతను.

“శాకాహారిని కాబట్టి!”

“శాకాహారమంటే నీ అభిప్రాయంలో జీవం లేనిదనేగా? మరి చెట్లకు ప్రాణం ఉన్నదని నీకు తెలియదా?”

“చెట్లకు ప్రాణమున్నా జీవజాలంలో ఆ జాతి వేరు. ఒక మేకకి కాలు కోస్తే, అక్కడ ఇంకో కాలు మొలవదు. చెట్టు కొమ్మ విరిస్తే అక్కడ ఇంకో కొమ్మ మొలుస్తుంది” అన్నాను.

“అయితే ఒక రకం చేప ఉంది. దానికి కొమ్ములుంటాయి. వాటిని కోస్తే మళ్లీ కొత్త కొమ్ములు మొలుస్తాయి. ఆ చేపల్ని తినడానికి అభ్యంతరం లేదుగా” అన్నాడు మ్యుల్లర్.

“చేపల్ని తినే ప్రసక్తి లేదు. వాటి కొమ్ముల సంగతి ఆలోచిద్దాంలే” అన్నాను నవ్వేసి.

మ్యుల్లర్ కూడా నవ్వేసి, “నువ్వు చాలా మొండి. అది సరే కానీ, మాంసాహారం తినకపోవడం వల్ల నువ్వు అహింసాపరుణ్ణని అనుకుంటున్నావు కదూ!” అన్నాడు.

“అలా అనుకుందుకు ఈ ప్రపంచంలో హింసలేనిదెక్కడ? నేను చెట్లని హింసిస్తున్నాను. నువ్వు జంతువుల్ని హింసిస్తున్నావు. కొన్ని ప్రాంతాల మనుషుల్ని తినేవాళ్లు కూడా ఉన్నారు. వాళ్ల సంగతలా ఉంచితే – తమ అలవాట్లకు భిన్నంగా ఉన్నవారిని మాటలతో హింసించాలనుకునేవాళ్లు కూడా ఉన్నారు” అన్నాను.

మ్యుల్లర్ నవ్వి, “రావ్! నన్ను అపార్థం చేసుకోకు. నేను నీ మిత్రుణ్ణి. ఇక్కడ నీకే సహాయం కావాల్సినా నిస్సంకోచంగా నన్నడుగు” అన్నాడు.

“మనం చిన్నపిల్లలం కాదు. అపార్థాలు పరిణతి చెందని మెదడుకి సంబంధించినవి” అన్నాను.

ఆతర్వాత మ్యుల్లర్ నాకు దగ్గర స్నేహితుల్లో ఒకడయ్యాడు. క్రీడారంగం పట్ల ఉన్న అభిరుచి అతనికీ నాకూ సానిహిత్యాన్ని పెంచింది.

“క్రీడారంగంలో మీ దేశం బాగా వెనుకబడింది” అన్నాడు మ్యుల్లర్ ఒకసారి.

“నిజమే. అభాగ్యులతో నిండిన దేశం మాది. ముందు పౌరులందరికీ తిండి కావాలి. ఆ తర్వాతే క్రీడలపై ఆసక్తి” అన్నాను.

“మీ దేశానికి ఇంత పేదరికం ఎలా వచ్చింది? “ అడిగేడతను.

ఠక్కున చెప్పాను, “పాశ్చాత్య దేశాల దోపిడి”

అతని మొహం అదోలా ఐపోయింది, “పాశ్చాత్యదేశాలకి మీ దేశాన్ని దోచే శక్తి ఎలా వచ్చింది?” అన్నాడు తమాయించుకుని.

“దొంగలెప్పుడూ సామాన్యులకంటే తెలివిగా ఉంటారు” అన్నాను.

ఏమనుకున్నాడో మ్యుల్లర్ వెంటనే, “నువ్వు కమ్యూనిస్టువా?” అన్నాడు.

"కమ్యూనిజం అంటే నాకు తెలియదు. నేను సర్వమానవ సమానత్వాన్ని కోరతాను. దాంతోపాటే వ్యక్తి స్వాతంత్ర్యాన్నీ, వాక్ స్వాతంత్ర్యాన్నీ కూడా కోరుకుంటాను. ఇప్పుడు కమ్యూనిస్టు దేశాలుగా చెలామణీ అవుతున్న దేశాల్లో ఆ స్వాతంత్ర్యాలున్నాయనుకోను" అన్నాను.

మ్యుల్లర్ కళ్లు మెరిసాయి, "ఆ విధంగా చూస్తే మా దేశం ఆదర్శప్రాయం కదూ!" అన్నాడు.

"అలాగనుకుందుకు లేదు. మీ దేశంలో పేదరికం లేకపోవచ్చు. కానీ సర్వమానవ సమానత్వాన్ని మీరు ఆమోదించారనుకోను. మీ దేశపు ప్రగతికి కారణం మీలో కులమతభేదాలు లేకపోవడమనిపిస్తుంది. ఆ భేదాలు మమ్మల్ని పీల్చి పిప్పి చేస్తున్నాయి. ఐతే కొంచెం లోతుగా ఆలోచిస్తే అందుకు మీరూ అతీతులు కారనిపిస్తుంది. మీలో మేము జర్మన్సుమన్న అహముంది. మీరంతా జర్మనీ ప్రగతికోసమే పాటు పడుతున్నారు. మీ ప్రగతి అందరికీ తెలియాలి. మీ భాష ప్రపంచంలో పేరెన్నిక గన్న భాష కావాలి. భారతదేశంలో ఒక కులం మరో కులాన్ని మించాలనీ, ఒక భాష మరో భాషని మింగాలనీ ప్రయత్నించడంవల్ల మొత్తం దేశం ఇబ్బంది పడుతోంది. మీరు దేశమంతా ఒకే కులంగా ఉన్నారు. అందువల్ల మీ దేశం ఆర్థికంగా ప్రపంచంలో అత్యున్నత స్థాయికి చేరుకుంది. కానీ అంతటితో మీ బాధ్యత ఐపోయింది. మిగతా ప్రపంచం ఏమైపోయినా మీకు బాధలేదు. ఈ భూప్రపంచమంతా ఒక్క దేశమైతే, మానవులంతా ఒక్కటే జాతి ఐతే– మీది జర్మన్ కులం. మీ కులం ప్రగతికి మీరు పాటు పడుతున్నారు. ఇందులో సర్వమానవ సమానత్వం ప్రసక్తి లేదు. ఐతే మీ సామర్థ్యం మాత్రం అభినందనీయం, ఆదర్శప్రాయం"

"నీతో వాదించడం కష్టం. నువ్వు చాలా తెలివైనవాడివి" అన్నాడు మ్యుల్లర్.

చర్చలకు ఫుల్‌స్టాప్ పెట్టడంలో అదో మంచి పద్ధతి.

ఇండియాపై జర్మన్ పౌరుల దురభిప్రాయానికి ముఖ్యకారణం – ఒక్కటే. అది రాజకీయం.

ఇండియా రష్యావైపు మొగ్గుతోంది. రష్యా కమ్యూనిస్టు దేశం. ఈ కారణంగా జర్మనీలోని ప్రచార సంస్థలన్నీ కూడా ఇండియాని తమ కోణంలో ప్రదర్శించి – పౌరుల్లో దురభిప్రాయాన్ని పెంచుతున్నారు. వాటిల్లో ముఖ్యమైనది టెలివిజన్.

ఒకసారి టెలివిజన్లో ఇండియా గురించి ఓ కార్యక్రమం వచ్చింది.

ఆరంభంలో పెద్ద ప్రేలుడు. అది అత్యంత ఆధునిక వైజ్ఞానిక ప్రగతికి సూచికగా అణు విస్ఫోటం. అందుకు తగిన పరిశోధనలు జరిగే బాబా అటామిక్ రీసెర్చి సెంటర్ భవంతుల్ని తర్వాత చూపించారు. ఆ తర్వాత టివి తెరపై 'ఆ భవంతులకు కొన్ని కిలోమీటర్ల దూరంలో....' అని ఒక వాక్యం.

బొంబాయి మురికివాడలు. వారి నికృష్ట జీవనం....

జర్మన్ పౌరుల ఊహకందని నికృష్టజీవనమది.

ఆ తర్వాత ఇండియాలో అన్నింటా బొంబాయికి దీటు వచ్చే మరో మహానగరం కలకత్తాని చూపించారు. మొక్కుబడికి కొన్ని కట్టడాల్ని చూపించేక – నగరం నడిబొడ్డులో పేవ్‌మెంట్లమీద పేడ వేస్తూ యథేచ్ఛగా సంచరిస్తున్న గోమాతలు....

మొత్తం కార్యక్రమం ఈ తీరులో రూపొందించబడింది.

ఇక నా మిత్రులు ఊరుకుంటారా?

మర్నాడు ఆఫీసులో లంచ్ టైంలో ఆ టివి కార్యక్రమం చర్చకు వచ్చింది.

"రావ్, నిన్న రాత్రి టీవీలో మీ ఇండియాని చూశాం" అన్నాడు అహమ్మద్. అతడి పక్కనే నిలబడి మ్యుల్లర్, డెకర్ట్ నవ్వుతున్నారు.

అహమ్మద్ మాట్లాడిన విధానం, ఆ ఇద్దరి నవ్వులు – దేనికి నాంది కాగలవో ఊహకందింది.

నేను కూడా నవ్వి, "ఏం చూశారు?" అన్నాను.

డెకర్ట్ వెంటనే అందుకుని, "మహానగరం మధ్యలో గోసంచారమా? ఇది నిజమా?" అన్నాడు.

అతడి మాటలో ఎగతాళి కంటే ఆశ్చర్యమే ఎక్కువుంది. అది నేనర్థం చేసుకోగలను. మరి జర్మనీలో ల్యూనబర్గువంటి చిన్న ఊళ్లో కూడా నేనెక్కడా రోడ్లమీద పశువుల్ని చూడలేదు.

"నిజమే!" అన్నాను కాస్త బాధగానే.

"నగరం నడిబొడ్డులో పశువులు. పక్కకెడితే మురికివాడల్లో పశువులకంటే హీనంగా జీవిస్తూ మనుషులు. ఇదంతా సాటిపౌరులు ఎలా సహించగల్గుతున్నారు?" అన్నాడు డెకర్ట్.

ఆ ప్రశ్నలో న్యాయముంది. ఒక దేశపు పరువు ప్రతిష్ఠలు – అక్కడి వైజ్ఞానిక ప్రగతిమీద కాదు. ఆ దేశపు సగటు పౌరుని జీవనప్రమాణంపై ఆధారపడి ఉంటాయి. ఈ విషయాన్ని భారతదేశంలోని రాజకీయవాదులు, స్వచ్ఛంద సేవాసంస్థలు గుర్తించేదెప్పుడు?

నాడు కూలీల కడుపు మాడ్చి తాజమహల్ కట్టించాడు షాజహాన్.

నేడు కోట్లాది ప్రజలు కడుపు కాలి ఏడుస్తుంటే – అణ్వస్త్ర ప్రయోగాలు చేస్తోంది ప్రజాస్వామ్య ప్రభుత్వం.

లక్షల వ్యయంతో వివేకానందుడికి స్మారకచిహ్నం కడితే – లక్షలాది దీనుల గోడుకి చలించిపోయిన ఆ మహనీయుడి ఆత్మకు శాంతి కలుగుతుందా?

అర్థం లేని ప్రతిష్ఠకోసం, ప్రయోజనం లేని స్మారక చిహ్నాలకోసం తాపత్రయం మాని – సగటు పౌరుడి గురించి తీవ్రంగా, సిన్సియర్‌గా ఆలోచించే రోజు మన దేశంలో రాదా?

"రావ్ మాట్లాడ్డం లేదు" అన్నాడు మ్యుల్లర్.

"మాట్లాడ్డానికేముంది? నిన్న టెలివిజన్లో చూసేవరకూ మీకు ఇండియా గురించి తెలియదా?" కాస్త కటువుగానే అడిగాను.

"తెలియదు" అన్నాడు మ్యుల్లర్.

"ఆర్థికంగా వెనుకబడినా మీకంటే మా పరిజ్ఞానమే మెరుగు" అన్నాను. ఒకోసారి ఆత్మరక్షణకు ఎదురుదాడికి మించిన ఉపాయం ఉండదు. "టీవీలు లేకపోయినా, మాకు ప్రపంచంలోని చాలా దేశాల గురించి చాలా విషయాలు తెలుసు"

డెకర్ట్ వెంటనే, "ఈ విషయంలో మ్యుల్లర్ని జర్మన్ల పరిజ్ఞానానికి ప్రతినిధిని చెయ్యకు. చాలా ప్రపంచ దేశాల గురించి చాలా విషయాలు నాకు తెలుసు" అన్నాడు.

"అలాంటప్పుడు నిన్నటి అణువిస్ఫోటానికి మీరంతా ఎందుకంత ఆశ్చర్యపడ్డారు? మా దేశం ఒకప్పుడు జ్ఞాన విజ్ఞానాలకు కేంద్రంగా, భోగభాగ్యాలకు నిలయంగా ఉండేది.

శతాబ్దాలుగా ఎన్నో విదేశీ దండయాత్రలు మా దేశాన్ని పీల్చి పిప్పి చేశాయి. ఆ సందర్భంలో కొన్ని జాతులు, కొన్ని కులాలు వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుని బాగుపడి, మిగతావారిని బాగా అణగద్రొక్కేశాయి. శతాబ్దాలుగా అణగద్రొక్క బడ్డ కోట్లాది జనం – చెట్టుమీంచి కిందకు రావడానికి తాము కూర్చున్న కొమ్మనే నరుక్కునేంతటి అమాయకత్వం, అజ్ఞానంలో పడిపోయారు. వారిని ఉన్నపళాన మాటలతో బాగు చెయ్యడం సాధ్యం కాదు. మానసిక పరిణతి కలిగితే తప్ప వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడదు. వారితోనే కలిసి నడవాలంటే దేశ ప్రగతికి శతాబ్దాలు పట్టినా ఆశ్చర్యం లేదు. ఇది మీకు అర్థంకాని పరిస్థితి" అన్నాను.

"ఐతే ఏమంటావ్?" అన్నాడు డెకర్ట్ కుతూహలంగా.

“దానికే వస్తున్నాను. మా దేశపు దౌర్భాగ్యస్థితి గురించి ఎప్పటికప్పుడు మీడియా మీకు చెబుతూనే ఉంది. మీకు తెలియనిదల్లా, మా దేశం పేదలకోసం కృషి చేస్తూనే, ఇతర రంగాల్లో వెనుకబడిపోకుండా ఉండడానికి చేస్తున్న కృషి గురించి. మురికివాడల్ని చూస్తూ అదే ఇండియా అని భ్రమిస్తున్న పాశ్చాత్యదేశ పౌరులకు ఇటీవల మా దేశంలోని పరిశోధనాత్మక అణువిస్ఫోటం దిగ్భ్రాంతి కలిగించింది. దానికి తట్టుకోలేని మీడియా – అభినందించడానికి బదులు – నిన్న మీరు చూసినలాంటి దృశ్య కార్యక్రమాలతో విషయాన్ని పక్క దారి పట్టిస్తోంది” అన్నాను.

లంచ్ టైమయింది. ఆ సంభాషణ అక్కడితో ఆగిపోయింది. ఆ తర్వాత దాన్ని పునరుద్ధరించే ప్రయత్నం వాళ్లనుంచి జరుగలేదు.

నాకది సంతోషమే. ఎందుకంటే....

ఏదో అనాలి కాబట్టి అనేశాను కానీ, ఇండియా ప్రగతిని మానసికంగా నేనూ సమర్థించలేకపోతున్నాను. మన రాజకీయవాదుల స్వార్థ సంకుచిత మానసం నాకు తెలియదా?

జర్మనీ వచ్చినప్పట్నించీ నేనక్కడి ప్రతి విశేషాన్నీ తరచి తరచి పరిశీలిస్తున్నాను. మన వ్యవస్థతో పోల్చుకుంటున్నాను. మన దేశపు అథోగతికి కారణాలు అన్వేషిస్తున్నాను.

ఏదో చెయ్యాలని కాదు. ముందు మనమేమిటీ, ఏంకాదూ అన్న స్పృహ ఉండాలి కదా!

నిత్యజీవితంలో సంప్రదాయపరంగా అక్కడి విభిన్నత నాకు చాలా ఆశ్చర్యంగా ఉండేది.

ఒకరోజున మ్యుల్లర్ కుర్చీలో కూర్చుని కాళ్లు బారచాపి ఎదుటి టేబుల్ మీద ఆనించి కూర్చున్నాడు. ఆ సమయంలో డాక్టర్ రాలెక్ వచ్చి, “అహమ్మద్ ఉన్నాడా?” అనడిగాడు.

మ్యుల్లర్ కూర్చున్నవాడు కూర్చున్నట్లే ఉన్నాడు. కాళ్లలోనూ కదలిక లేదు. “లేదు” అన్నాడు.

నేనక్కడ నిలబడే ఉన్నాను. ఐనా రాలెక్ రాకతో నాలో వినయ గౌరవాలతో కూడిన ఓ కదలిక. వచ్చినవాడు గురువన్న భావన మ్యుల్లర్‌కి స్ఫురించినట్లే లేదు. రాలెక్‌కి కూడా అక్కడ జరుగకూడనిదేదో జరిగిన భావన మనసులోకి వచ్చినట్లు లేదు. మామూలుగా వెళ్లిపోయాడు.

ఒకసారి అహమ్మద్‌కి సిగరెట్ కావాల్సొచ్చింది. వాళ్లనీ వీళ్లనీ అడిగి లేదనిపించుకున్నాక సరాసరి రాలెక్ వద్దకి వెళ్లి అడిగాడు. అప్పుడాయనవద్ద కూడా సిగరెట్ లేదు. “నీ దగ్గర పైపుంటే పుగాకు పొడెం ఇస్తాను. ప్రస్తుతానికి అదే ఉంది నాదగ్గర” అన్నాడు నొచ్చుకుని.

ఇలాంటి సంఘటనలు నాకు కొత్తగా, వింతగా, ఆశ్చర్యంగా ఉండేవి.

మ్యుల్లర్, డెకర్ట్, అహమ్మద్‌లకి రాలెక్ అంటే ఏమాత్రం తూష్ణీభావం లేదు. వాళ్లకి ఆయనంటే చాలా గౌరవమని వాళ్ల మాటల్ని బట్టి తెలిసేది. ఎటొచ్చీ ఆ గౌరవంతో వాళ్లాయన్ని దేవుడిగా భావించడం లేదు. తమకంటే ఎక్కువ జ్ఞానమున్న సాటిమనిషిగా అనుకుంటున్నారు. ఆయన్ని వాళ్లు సర్ ఆనరు. సాధారణంగా రాలెక్ అనీ, అప్పుడప్పుడు డాక్టర్ రాలెక్ అనీ పిలుస్తారు. ఆయన చెప్పిందాంట్లో తప్పుందనిపిస్తే, “డాక్టర్, రాలెక్! యూ ఆర్ రాంగ్” అనడానికి సంకోచించరు.

ఇండియాలో ప్రొఫెసర్లని సర్ అని తీరాలి. వాళ్లేం చెప్పినా వెర్రినవ్వు నవ్వుతూ తలూపాలి. ప్రొఫెసర్ల మాటలో తప్పులుంటే ఎంచకూడదు. గురువు తప్పు చెప్పడని నమ్మాలి.

వర్తమాన కాలానికి ఈ సంప్రదాయం సరిపడక, మనని ముందుకెళ్లకుండా ఆపుతోందని నాకనిపించింది.

ఒకప్పుడు బ్రాహ్మణుల్ని గౌరవించడం సంప్రదాయం. బ్రాహ్మణుడంటే బ్రహ్మవిద్యని పొందినవాడు. క్రమంగా ఆ గౌరవం విద్యనుంచి వ్యక్తికి మారింది. పొట్టకోసినా అక్షరంముక్క లేనివాడు, సకల దుర్వ్యసనాలకూ బానిసైన వాడు – బ్రాహ్మణ కులంలో పుట్టిన కారణంగా

గౌరవానికి అర్హుడయ్యే దురాచారం మొదలైంది. అనర్హుడికి గౌరవమిస్తే అహంకారి ఔతాడు. అనర్హుల సంఖ్య పెరిగినకొద్దీ అహంకారుల సంఖ్య పెరుగుతుంది. వారు సమాజాన్ని శాసిస్తూ అర్హుల్ని మూలకి నెట్టేస్తారు. అర్హులకి అహంకారముండదు కాబట్టి, వారు మూలలో ఉండిపోవడానికి కించపడరు. కానీ సమాజం మూలబడిపోతుంది.

రాలెక్ ఎప్పుడైనా పొరపాటు పడితే, దాన్ని సవరించడంవల్ల సైన్సుకి న్యాయం జరుగుతుంది తప్పితే, రాలెక్‌కి అన్యాయం జరగడం లేదు. మన విశ్వవిద్యాలయాల్లో, రీసెర్చి సంస్థల్లో గురువులు, అధినేతలు అలా అనుకోరు. తమకంటే తెలివైన శిష్యుణ్ణి మన గురువులు సహించలేరు. అందువల్ల అటు విద్యకూ, ఇటు వ్యక్తిత్వాలకూ

న్యాయం జరగడం లేదు. మన సైంటిస్టులు ఎంత ప్రతిభావంతులైనా, దేశంలో ఉండి రాణించలేక పోవడానికి కారణం – గురువుల్ని దైవంగా చూడ్డమేనని నాకు అనిపించింది.

అంతమాత్రాన మన సంప్రదాయం జర్మన్లకు నచ్చదనుకుందుకు లేదు. ల్యూనబర్గులో గ్యోతే ఇన్‌స్టిట్యూట్‌లో మొదటి రెండు నెలల కోర్సుకీ ఫ్రౌ ష్వయరింగ్ మా టీచరు.

తర్వాతి కోర్సుకి మారేటప్పుడు ఆమెకి వీడ్కోలు చెప్పాం. అప్పుడు పంజాబీ శర్మ చటుక్కున వంగి ఆమెకి పాదాభివందనం చేశాడు. అదేమిటని తడబడిందామె.

"గురువు పాదాలకి నమస్కరించడం మా సంప్రదాయం" అన్నాడు శర్మ.

అప్పుడు నేను మా టీచరు కళ్లలో కొత్త వెలుగు చూశాను. గురువులనిలా గౌరవించేచోట తాత్కాలికంగానైనా కొన్నాళ్లు పాఠం చెప్పాలన్న అభిలాష క్షణంపాటు ఆమె కళ్లలో మెరిసింది.

వ్యక్తిపూజ ఎవరికైనా ఆనందాన్ని కలిగిస్తుంది. అది వ్యక్తి పతనానికి దారి తియ్యడమూ అంత సహజమే ననడానికి మన దేశంలో విద్యావ్యవస్థలోనే కాదు, అన్ని వ్యవస్థల్లోనూ ఎన్నో ఉదాహరణలున్నాయి. చివరికి క్రీడారంగం కూడా అందుకు మినహాయింపు కాదు.

ఒకసారి నేను డెకర్ట్‌తో మాట్లాడుతూ – పద్ధతి ప్రకారం అన్నీ సక్రమంగా జరిపోయే వ్యవస్థని రూపొందించిన జర్మనీ పాలనా దక్షతని మెచ్చుకున్నాను. రైళ్ల రాకపోకల్ని ప్రత్యేకంగా మెచ్చుకున్నాను. ఎక్కిన ప్రతివారికీ సీట్లు దొరకడం, అన్న టైముకి ఒక్క క్షణం కూడా అటూ ఇటూ కాకుండా రాకపోకలు జరగడం అసామాన్యమని నాకు నిజంగానే అనిపించింది.

డెకర్ట్ నా పొగడ్తకు సంబరపడి, "అదో పెద్ద విశేషమా? మీ దేశంలో రైళ్లు మాత్రం సకాలంలో నడవ్వా?" అన్నాడు మొహమాటానికి.

నిజం చెప్పకుండా ఉండలేకపోయాను. రిజర్వేషన్‌తో మొదలై, మన దేశంలో రైలు ప్రయాణంలో ఉండే ఇబ్బందులన్నీ అతడికి ఏకారువు పెట్టాను. రిజర్వేషన్ దొరకడం ఎంత కష్టమో, రిజర్వేషన్ లేకుండా రైలు ప్రయాణమెలా ఉంటుందో, కదుల్తున్న రైల్లోంచి జనం ఎలా వ్రేలాడుతుంటారో, రాకపోకల్లో గంటల తరబడి ఆలస్యమెలా గౌతుందో – అన్నీ కళ్లకి కట్టించాను.

నావి ముఖప్రీతి మాటలు కావనీ, నేను జర్మనీని పొగడ్డానికి కారణముందనీ అతను గ్రహించాలని నా తాపత్రయం. ఆతను నా మాటలు శ్రద్ధగా విని, "రైల్వే జర్నీకి మీ దేశంలో చాలా డిమాండ్ ఉన్నట్లుంది. మరి రైళ్ల సంఖ్య పెంచొచ్చుగా" అన్నాడు.

"పెంచొచ్చు. కానీ డబ్బుండాలిగా" అన్నాను.

"రైళ్లు పెంచడానికి డబ్బు లేదంటావ్. మరి బాంబు తయారు చెయ్యడానికి డబ్బు బాగానే ఉన్నట్లుందే" అన్నాడు డెకర్ట్.

ఊహించని ఈ ఎదురుదెబ్బకి మ్రాన్పడిపోయాను. తమాయించుకుందుకు కొన్ని క్షణాలు పట్టింది.

"పదిమందున్న ఇంట్లో ఓ జబ్బు మనిషి ఉన్నాడనుకో. అంతా అన్ని పనులూ మానుకుని దిగాలు పడి కూర్చోరు కదా! రోగికి చెయ్యాల్సిన ఏర్పాట్లు చేసి ఎవరి పనుల్లో వారుంటారు. మిగతా ప్రపంచంతో కలిసి ముందడుగు వెయ్యడం కోసం, మేము అన్ని రంగాలమీదా

దృష్టి పెట్టాల్సి ఉందని ఇదివరకే నీకు చెప్పాను. అన్నార్తులున్న దేశంలో అణువిజ్ఞాన పరిశోధనలెందుకో ముందు కాలమే సమాధానం చెబుతుంది. ఇప్పటికే మా దేశంలో అణువిద్యుత్ లభిస్తున్న విషయం నీకు తెలిసే ఉండాలి" అన్నాను కాసేపాగి.

నేను ఇండియన్‌ని కాబట్టి అతని మాటలు నా అభిమానాన్ని దెబ్బతీసి ఉండొచ్చు. కానీ డెకర్ట్ మాటలు ఆలోచించ తగ్గవి.

ఇండియా సంపన్న దేశాలనుంచి ఋణాలు తీసుకుంటోంది. ఆ డబ్బు దుర్వినియోగం కాకూడదని డెకర్ట్ అనుకుంటాడు. ఆ ఏడు ఇండియా పరీక్ష పేరిట చేసిన న్యూక్లియర్ ఎక్స్‌ప్లోజన్ పాశ్చాత్య దేశాల్ని కలవరపర్చింది.

వివిధ దేశాల స్పందనలు – ఆయా దేశాల మధ్యనున్న సంబంధబాంధవ్యాల్నిబట్టి ఉంటాయి. అక్కడ వాస్తవం, తర్కాలకంటే రాజకీయాలదే ప్రాధాన్యం. నేను జర్మనీకి రావడం ద్వారా – ఆ విస్ఫోటం విషయమై అక్కడి సామాన్య పౌరుల మనోభావాలు ఎలా ఉన్నదీ ప్రత్యక్షంగా తెలుస్తోంది. అది నా అదృష్టం.

హైనర్ డెకర్ట్, మ్యుల్లర్ స్నేహపాత్రులు. నాకు మంచి మిత్రులు. తమ అభిప్రాయాల్ని నిస్సంకోచంగా చెప్పేవారు. ఒకళ్లను కించపర్చాలన్న దురుద్దేశ్యం వారిలో గోచరించేది కాదు. అందుకే నేను వారికి ఇండియా గురించి భేషజాలకు పోకుండా నిజాలే చెప్పాలని తపించేవాణ్ణి. వారు నానుంచి ఎన్నో విశేషాలడిగి తెలుసుకునేవారు.

ఇండియాలో మధ్యతరగతి కుటుంబీకులు ఎదుర్కొనే వివిధ సమస్యల్ని విన్నప్పుడు – వాళ్ల కళ్లలో భయాన్ని చూశాను. ఇండియన్సు నమ్మే మరుజన్మ నిజంగా ఉండి, తాము ఇండియాలో మధ్యతరగతి కుటుంబంలో పుడతామేమోనన్న భయమేమో అది!

ఒకసారి డెకర్ట్ ఏదో సందర్భంలో, "అన్నట్లు – ఇండియాలో చాలా ఇళ్లలో దొడ్లలో పాములు తిరుగుతాయిట కదా" అనడిగాడు కుతూహలంగా.

"అన్ని చోట్లా కాదు. ఒకప్పుడు అడవిగా ఉండేదాన్ని జనవాసంగా మార్చినప్పుడు అలా జరుగుతుంది. ఇంటి పెరట్లో తిరగడమే కాదు, ఒకోసారి ఇళ్లలోకి కూడా వస్తుంటాయి" అన్నాను.

ధవళేశ్వరంలో కొండమీద జనార్దనస్వామి గుడిమెట్ల పక్కన ఉండేది మా ఇల్లు. రోజూ ఎవరింట్లోకో పాము దూరడం తెలుసు. నేను మా పెరట్లో ఐదారుసార్లు పాముని చూశాను. ఇంట్లోకి రెండుసార్లు వచ్చింది. గోదావరికి వరదలొచ్చినప్పుడు పాములు మరింత తరచుగా కనబడుతుంటాయి.

ఇంకా చెప్పేవాణ్ణే – నా మాటలు వింటూ డెకర్ట్ మధ్యలో భయంతో కెవ్వుమనకపోతే!

నేను చెప్పేది అతడికి పాములతో సహజీవనంలా అనిపించిందిట.

నేను గమనించిందేమిటంటే – జర్మనీలో ఇళ్లలో దోమ, ఈగ, బల్లి లాంటివి మచ్చుకైనా కానరావు. చాలా ఊళ్లకి చివర్లో చెట్లతో నిండిన అడవులుంటాయి. అక్కడ పాములే కాదు, ఏ పురుగూ, పుట్రా ఉండవు.

మరి నేను చెప్పింది వింటే డెకర్ట్ భయంతో వణికిపోడూ!

మన దేశం కూడా పరిసరాల విషయంలో జర్మనీకి సాటి రావాలంటే అసాధ్యమేం కాదు. కానీ అందుకు పౌరులు బాధ్యత వహించాలి.

ఇక్కడి పౌరులు ఎక్కడపడితే అక్కడ ఉమ్మి వెయ్యరు. తుక్కు పారేయరు. అన్నింటికీ నిర్ణీత ప్రదేశాలున్నాయి. ఆరుకోట్ల పశ్చిమజర్మనీ పౌరుల్లో ఒక్కరంటే ఒక్కరు కూడా ఈ నియమాల్ని అలక్ష్యం చెయ్యకపోవడంవల్లనే – యావద్దేశం పరిశుభ్రతకు మారుపేరుగా ఉంది.

ఎన్నో పార్టీలకు వెళ్లాను. అక్కడ ఆల్కహాల్ ఏరులై ప్రవహించేది. నేను మాత్రం ఫలరసాలు, శీతల పానీయాలు తీసుకునేవాణ్ణి. ఆ విషయంలో కొందరు ఆడవాళ్లు నాకు కంపెనీగా ఉండేవారు. మగవాళ్లెవరూ వాటివైపు చూడనైనా చూసేవారు కాదు. పార్టీలు తరచుగా జరగడంవల్ల నా ఈ అలవాటుకి ఎంత ప్రచారం కలిగిందంటే, ఆల్కహాలు లేని ఇతర పానీయాల్ని 'రావూస్ డ్రింక్స్' అనడం రివాజయింది.

ఇక్కడివాళ్ల విషయం కాసేపు పక్కన పెట్టి – ఇక్కడ పరిచయమైన మనవాళ్ల విషయానికి వస్తే –

మనవాళ్లు

ప్రతి రోజూ ఓ కొత్త పరిచయం. కొత్త అనుభవం. కానీ నాలో ఏదో అసంతృప్తి. ఈ వింతలు, అనుభవాలు, అనుభూతులు – ఇవన్నీ నా ఒక్కడికేనా?

ధర్మార్థకామమోక్షాల్లో ఎన్నడూ విడిచి ఉండనని నేను చేసిన పెళ్లినాటి ప్రమాణాలు శుష్కమేనా?

ఈ కొత్త లోకంలో నా పక్కన భార్యాబిడ్డలు కూడా ఉంటే, ఇదే అనుభూతులకు నా స్పందన మరోలా ఉంటుందా?

బెర్లిన్లో అడుగుపెట్టేక ఓ వారం ఎలా గడచిపోయిందో గడిచిపోయింది. తర్వాతనుంచి నా మనసు నా భార్యాబిడ్డల చుట్టూ పరిభ్రమిస్తూ, మనసుకి స్థిమితం లేకుండా చెయ్యసాగింది.

వాళ్లిక్కడికి వస్తారంటే, అది వేరు. కానీ ఈ అనుభూతులు నా నోటితో వినడమే తప్ప తమ కళ్లతో చూడలేరన్న అసంతృప్తి నన్ను వెంటాడుతోంది.

నేను ఆశావాదిని. నా పరిస్థితిలో ఊహించని మలుపు వచ్చి, ఏదో అద్భుతం జరుగదా? నావాళ్లిక్కడికొచ్చి నాతో ఉండరా?

బెర్లిన్లో రెండంటే రెండు వారాలు గడిచాయేమో– సాయంత్రాలు నన్ను దిగులు ఆవహించేది. ఆ దిగుల్లోంచే ఏదో మూల అనిపించేది – నేనూ, నావాళ్లూ ఆ నగరవీధుల్లో కలిసి తిరగబోతున్నామని.

ఏ ప్రదేశం గురించైనా, విషయం గురించైనా మంచిచెడ్డలు నిర్ణయించాలంటే – ఒకో మనిషి ఒకోలా చెబుతాడు. ఒకే మనిషి కూడా అన్నివేళలా ఒకేలా చెప్పడు.

అభిప్రాయాల్ని మనిషి మూడ్ కూడా ప్రభావితం చేస్తుంది. మనిషి మూడ్ మనఃస్థితిపై ఆధారపడి ఉంటుంది.

అసంతృప్తితో బాధపడే మనిషికి సంతోషం దొరక్క, నిత్య దుఃఖితుడౌతాడు. అతని అసంతృప్తికి కారణమేమిటో తెలుసుకుని దాన్ని చల్లార్చేవరకూ, ఇతరాలేమీ ఎంత గొప్పవైనా అతనికి తృప్తి కలిగించవు.

ఇంత దూరమొచ్చి, ఇన్ని విలాసాలు, వైభోగాలమధ్య మసలుతున్నా – మనసు నావాళ్లకోసం అల్లాడుతోంది. మనసు వారి సాహచర్యంకోసం తహతహ లాడుతోంది. అందుకే నా మనసునిండా అసంతృప్తి. అది తొలగేదాకా నేను సరైన మూడ్‌లోకి రాలేను. అప్పుడు నా మనఃస్థితి మారి – ఇక్కడి విశేషాలపై స్పందన మరోవిధంగా ఉంటుందా?

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments